క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మరమ్మతుల కారణంగా అనుముల మండలంలోని పలు ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఏఈయచ్‌టీ లైన్ వర్క్ ఉన్నందువ మెయింటనెన్స్ కారణంగా హజారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని హజారిగూడెం, అలీనగర్, చల్మారెడ్డిగూడెం, కొట్టాల, నాయుడుపాలెం, ఇండస్ట్రియల్, వెంకట్ నగర్ ప్రాంతాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : ఖాళీ ప్రదేశాల్లో పేకాట స్థావరంపై మిర్యాలగూడ రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం జంకుతండా గ్రామశివారులో గల ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఖాళీ స్థలంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆ స్థావరంపై పోలీసులు దాడులు చేయగా వారిని పట్టుకొని వారి నుంచి రూ.3500లతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, 52 ప్లేకార్డులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అక్రమంగా ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నందిపాడు గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఒక ఆటో అనుమానస్పదంగా కనిపించడంతో అక్కడికి వెళ్లి చూడగా ఆ ఆటోలో అక్రమంగా మూడు క్వింటాళ్ల పీడీఎస్‌బియ్యం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు విచారించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంలో ఆటో డ్రైవర్‌ను విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లకు చెందిన కట్టా శ్రీనివాస్‌రావు అని పేర్కొన్నాడు. వాటర్ ట్యాంకు పరిసరాల్లో తెల్ల రేషన్ కార్డు హోల్డర్ల నుంచి తక్కువ ధరలకు బియ్యం సేకరించి ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు తీసుకెళ్తున్నాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చందంపేట : చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామంలో ఎలుగుబంటి సంచారంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు గ్రామంలో ఎలుగుబంటి జాడ కోసం అన్వేషిస్తున్నారు. కాగా ప్రజలు ఒంటరిగా బయటికి వెళ్లొదని, రాత్రి సమయంలో బయటికి రావద్దని, ఎలుగుబంటి సంచరిస్తుండడంతో నలుగురైదుగురు కలిసి బయటికి వెళ్లాలని ఎఫ్ఆర్ఓ భాస్కర్ సూచించారు. ఎలుగుబంటి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామంలో అటవీ శాఖ అధికారులు దప్పు చాటింపు చేపట్టారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో శనివారం కరాటేలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటేలోని కటాస్, స్పార్టింగ్, బ్రేకింగ్, స్టిక్ ఫైట్, నాన్ చాక్ కటాస్ వంటి అంశాలలో విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ కెకె.జయరాజన్ ప్రశంసపత్రాలు, బెల్టును అందజేశారు. ఈ ఖార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సుజన్‌కుమార్, శివశంకర్, నీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

కొండమల్లేపల్లి : ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో ఏడాది క్రితమే నూతనంగా ఇల్లు నిర్మించుకున్న బుడిగపాక భిక్షమయ్య ఇంట్లోకి అన్ని నూతన సామగ్రిని తెచ్చుకున్నాడు. శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లగా సాయంత్రం సమయంలో ఇంట్లో నుంచి పొగలు వస్తుండడంతో గమనించిన స్థానికులు భిక్షమయ్యకు సమాచారం అందించారు. కాగా భిక్షమయ్య ఇంటికి చేరుకొని ఇంట్లోకి వెళ్లగా ఇంట్లోని బీరువా, టీవీ. ఫ్రిజ్ తదితరవస్తు సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి.

నష్టపరిహారం ఇవ్వాలని వినతి

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా వరి, మిర్చి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర సంఘం నాయకుడు బండి శ్రీశైలం మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో రైతులు సాగు చేసిన వరి, మిర్చిపంటలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, నరసింహ, రాంరెడ్డి, మల్లేశ్ ఉన్నారు.

ఆలయ భూముల సర్వేకు సన్నద్ధం

- 21వ తేదీ నుంచి ప్రారంభం
- రైతులకు నోటీసులు జారీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు (ఫైల్)


కొప్పోలులోని సీతారామచంద్రస్వామి దేవాలయం

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంతోపాటు అనుబంధ ఆలయాలు సదాశివాలయం, అయోధ్య రామాలయం, అంజనేయ స్వామి ఆలయాలకు సంబంధించిన భూములపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ యంత్రాంగం సర్వేకు సన్నద్ధమవుతుంది. ఆలయాలకు దాతలు 70ఏళ్ల క్రితం వంద ఎకరాలు దానంగా ఇచ్చారు. ప్రస్తుతం 45ఎకరాలకు మాత్రమే కౌలు అందుతూ మిగతా భూమి గల్లంతైనంపై దేవాలయ కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తుంది. కొంతమంది కౌలు పేరు మీద సాగు చేసుకుంటూ తమ పట్టా భూమిలో కలుపుకోవడం, మరికొందరు ఏకంగా తమ పేరున రెవెన్యూ అధికారుల అండతో పట్టాలు చేయించుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు 2020 నుంచి దేవస్థాన కమిటీ, గ్రామ యువత వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం లేకపోయింది. ఇటీవల ఆలయభూముల అన్యాక్రాంతంపై పత్రికల్లో కథనాలు రావడం, దేవుడి భూములపై సర్వే చేసి హద్దు రాళ్లు పాతాలని ఆలయ కమిటీ చైర్మెన్ ఐతగోని పరమేష్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని, సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిని కలిసి వివరించి వినతిపత్రం అందించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రాథమిక నివేదికను ఆర్డీఓ ద్వారా కలెక్టర్‌కు పంపించి సర్వేయర్లను పంపించాలని కోరడంతో సర్వే చేసి హద్దు రాళ్లు పాతేందుకు రంగం సిద్ధమైంది.

41మందికి నోటీసులు

ఈ నెల 21 నుంచి ఆలయ భూములకు సర్వే నిర్వహిస్తామని, ఆయా సర్వే నెంబర్లలో భూములు గల రైతులు అందుబాటులో ఉండాలని 41మంది రైతులు నోటీసులు అందించారు. ప్రస్తుత సమయంలో వ్యవసాయ మెట్ట పంటలు కూడ లేనందున సర్వేకు ఎలాంటి ఆటంకాలు ఉండవని, సర్వేకు ఇదే అనువైన సమయమని అధికారులు భావిస్తున్నారు. ఆలయ భూముల పరిసర రైతులకు ఆన్‌లైన్‌లో ఎంత భూమి ఉంది, వారు ప్రస్తుతం ఎంత కబ్జాలో ఉన్నారో తేల్చనున్నారు. అన్యాక్రాంతమైన భూమి సర్వేలో తేల్చి హద్దు రాళ్లు పాతి దేవాలయ కమిటీకి అప్పగించనున్నారు. ఈ మేరకు రెవెన్యూ రికార్డులను కూడ సవరిస్తారు.

పక్కాగా సర్వే



ఎండోమెంట్ అధికారులు, రైతుల సమక్షంలో ఈ నెల 21 నుంచి ఆలయ భూముల సర్వే చేపడతాం. రైతులు, ఆలయ కమిటీ సభ్యులు సర్వేకు సహకరించాలి. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల ప్రకారం 79 ఎకరాలు ఆలయ భూములుగా ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తుంది.

– ఫరీదుద్దీన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్

కృత్రిమ మేధ.. వెనుకబడిన విద్యార్థులకు ఉపయోగం


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

మిర్యాలగూడ : అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు కృత్రిమ మేధా ఉపయోగపడుతుందని దామరచర్ల ఎంఈఓ ఎం.బాలాజీనాయక్ తెలిపారు. దామరచర్ల మండలంలోని కల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధా కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక ఉపకరణాల వల్ల ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులను అభ్యాసనం వైపు ఆసక్తి పెంచడానికి కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా డిజిటల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నందున తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని కోరారు. అదేవిధంగా కల్లెపల్లి జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోని క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు మాలి, ధరావత్ బుజ్జిలింగానాయక్, మాజీ ఎంపీటీసీ ధరావత్ శారదాపాచునాయక్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, నారాయణ, భారతి, కీర్తన, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, గురువారెడ్డి, కవిత, శ్రీనివాస్‌నాయక్, పాషా, నాగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

హాలియా : కాన్షీరామ్ జయంతి సందర్భంగా శనివారం హాలియాలో ఆయన చిత్రపటానికి ధర్మ సమాజ్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు మామిడి రవి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం మామిడి రవి మాట్లాడుతూ భారతదేశంలో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల పోరాటాన్ని ముందుకు నడిపించిన యుద్ధ వీరుడు కాన్షీరామ్ అన్నారు. కాన్షీరామ్ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కడుపేదలైన బడుగు, బలహీన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్ 10వేల కిలో మీటర్ల స్వరాజ్య పాద యాత్ర చేసి రాజకీయ పార్టీని నిర్మాణం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు మండల అధ్యక్షుడు రమేష్, అనుముల మండల కమిటీ సభ్యులు గోవర్ధన్, ప్రసాద్, కోటేష్, నరేంద్ర ప్రసాద్, లక్ష్మణ్, శివశంకర్ ఉన్నారు.


కాన్షీరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

వేములపల్లి : మండలంలోని సల్కునూరు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం పురోహితుల అల్లయ్య, తిరుమల అయ్యంగార్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో భాగంగా తమ్మడబోయిన అర్జున్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తమ్మడబోయిన రామన్న, కందుకూరి వీటీ కందుకూరి సుందర్శన్, గడ్డం శ్రీనివాస్, చక్కని సత్యం, గుంటోజు నాగరాజు, శ్రీనివాస్, అంకెపాక శ్రీనివాస్, బత్తుల సురేష్, జెర్రిపోతుల సైదులు, కారంపూడి భాను తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ చర్చి వార్షికోత్సవం


వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న బిషప్‌లు, ఫాదర్లు

నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలోని సెయింట్‌జోసెఫ్ చర్చి 54వ వార్షికోత్సవ వేడుకలు శనివారం పారిష్ ప్రీస్ట్ ఫాదర్ సాగిలి జయరాజు ఆధ్వర్యంలో చర్చి సంఘస్తులు ఘనంగా నిర్వహించారు. మొదటి మూడు రోజుల పాటు ప్రత్యేక పార్థనలు నిర్వహించగా, అతిథులుగా హాజరైన పలు చర్చీలకు చెందిన ఫాదర్లు చేసిన ప్రసంగాలను, మాస్‌ను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలకించారు. నల్లగొండకు చెందిన బిషప్ కరణం ధమన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మార్చినెల సెయింట్ జోసెఫ్‌కు అంకితం చేయబడినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెరాల్డ్స్ ఆఫ్ గుడ్‌న్యూస్ ప్రావెన్షియల్ ఫాదర్ పచ్చిగొల్ల క్రీస్తు రాజు,ఫాదర్ మధు, సిస్టర్లు లలిత,క్లారా,ప్రియా చర్చి పెద్దలు అంతయ్య, డీఎస్‌రాజు, ఫ్రాన్సిస్, అనంత్ అంతోని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియమకాలను చేపట్టాలని ఎంఎస్‌ఎఫ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సంద్ర నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన రిలే దీక్షలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి మడుపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మహంకాళి సురేష్, వివిధ మండలాల నాయకులు సూరన్న, రెమడాల సత్యం, కోట రాజు, ఖాజాబాయ్, మాతంగి లలిత, కళావతి, బంటు స్రవంతిలతో పాటు పలువురు నాయకులు తదితరులున్నారు.

నేడు వేగవంతమైన చెస్ చెక్‌మెట్ సాల్వర్

మిర్యాలగూడ : మిర్యాలగూడ డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎస్ఎన్‌డీ ఫంక్షన్‌హాల్‌లో నోబెల్ వరల్డ్ రికార్డ్స్ వేగవంతమైన చెస్ చెక్‌మెట్ సాల్వర్ నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. మాస్టర్ గుండా కార్తికే కేవలం పది నిమిషాల్లో 180 చెక్‌మెట్ ఫజిల్‌ను పెట్టడం ద్వారా నోబెల్ వరల్డ్ రికార్డును సాధించేందుకు ప్రయత్నించనున్నారని తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, నేత్ర నిధి వ్యవస్థాపకులు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ డైమండ్ మాశెట్టి శ్రీనివాస్‌లు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఎంఈఓలను సస్పెండ్ చేయాలి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

చింతపల్లి : ఒక ఉపాధ్యాయ సంఘానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న చింతపల్లి ఎంఈఓ నీరుడు అంజయ్య, మర్రిగూడ ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, వీటీ నగర్ స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కృష్ణమ్మలను వెంటనే సస్పెండ్ చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. చింతపల్లి మండలంలోని వీటినగర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా బసవరాజు శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎలా పాల్గొంటారని యూటీఎఫ్, పీఆర్‌టీయూ తెలంగాణ, టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రశ్నించారు. ఉపాధ్యాయులు పర్యవేక్షించే సిబ్బంది ఏ సంఘానికి కూడా అనుకూలంగా వ్యవహరించొద్దన్నది నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఎంఈఓలు, స్కూల్‌కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు ఒక సంఘానికి మద్దతుగా వ్యవహరిస్తే మిగిలిన సంఘాల ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఒక సంఘం నేత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని యూటీఎఫ్ చింతపల్లి మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ ప్రశ్నించారు. ఈ ముగ్గురు అధికారులపై సోమవారం గ్రీవెన్స్‌డే లో జిల్లా కలెక్టర్ డీఈఓలకు ఫిర్యాదు అందజేయనున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక ఉపాధ్యాయ సంఘానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు


సబ్సిడీ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 31వ తేదీ పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలో బకాయిదారుల దగ్గర వసూలు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొండిబకాయిదారులకు ముందుగా రెడ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఆస్తులను జప్తి చేసుకుంటామని పేర్కొన్నారు.ఈనెల 31వ తేదీ వరకు ఆస్తి పన్నుల బకాయిలను చెల్లించాలన్నారు. ఆయన వెంట ఆర్ఓ జ్ఞానేశ్వరీ, ఆర్ఐలు సాంబయ్య, సాజి, వార్డు ఆఫీసరు ఎర్ర సైదులు తదితరులున్నారు.

ఎల్ఆర్ఎస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రం అందజేత

మున్సిపాలిటీ పరిధిలో లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా (ఎల్ఆర్ఎస్) 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకుంటే వెంటనే ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శనివారం ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తులు చేసుకున్న దరఖాస్తుదారులు 25శాతం రాయితీ పొందితే క్రమబద్ధీకరణ అనంతరం పత్రాలను అందిస్తున్నామన్నారు. ఒక్క రోజే 10 వరకు ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది సకాలంలో పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పట్టణ పరిధిలో ఆస్తి పన్నులు, నల్లా బిల్లు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు గడువు లోగా వసూలు చేయాలని సూచించారు. వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు.మున్సిపాలిటీ పరిధిలో దుకాణదారులు రోడ్లపై చెత్త వేయకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఆరిఫ్, సురిగి శంకర్, రాజు, రాకేశ్, తదితరులున్నారు.

జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణం


ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగార్జునసాగర్ : మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ సెషన్ మొత్తం సస్పెండ్ చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ శనివారం నందికొండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు మాజీ కౌన్సిలర్ రమేశ్‌జీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళినాయక్, లక్ష్మణ్‌నాయక్, సైదులు, సత్యనారాయణ, సతీష్, అంజయ్య, దావీద్, కోట్యానాయక్, సుగుణ, రమణ, సక్రిబాయ్, మారయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

అడవిదేవులపల్లి : వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ రమేష్ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న ఉపాధి పథకం, నర్సరీలు, పారిశుద్ధ్య నిర్వాహణ తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్, ఏపీఓ సూరానాయక్, అమీర్ అలీ, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

పోడు భూములకు రుణాలు ఇవ్వాలి


రైతులతో మాట్లాడుతున్న కంబాలపల్లి ఆనంద్

పెద్దఅడిశర్లపల్లి : పోడు భూములకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బాణాలకుంటలో సీపీఎం పోరుబాటలో భాగంగా గ్రామ సమస్యలపై సర్వే చేసి మాట్లాడారు. ఈ నెల 24న తహసీల్దార్ కార్యాలయం, 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, భీముడు, శ్రీను, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపులో రాయితీ ఇవ్వాలి


మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేశ్

మిర్యాలగూడ అర్బన్ : మున్సిపల్ ఆస్తిపన్నులో వడ్డీ రాయితీ ఇవ్వాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేశ్ డిమాండ్ చేశారు.శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏడాది మార్చిలో ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేస్తుందని, ఆ సమయంలో వడ్డీ రాయితీ ఇస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు వుసులుబాటు కల్పిస్తుందని తెలిపారు. జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం 90శాతం మాఫీ ఇచ్చారని రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో వడ్డీ మాఫీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున వడ్డీ రాయితీపై చర్చించి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, పరశురాములు, రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, భాషా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ఇండ్ల కోటయ్యగూడెం గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు రామకృష్ణ కుమారుడు బీర్ల ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో శనివారం నాగార్జున సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ మృతుడు బీర్ల ప్రశాంత్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నిడమనూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యపాల్, నాయకులు సైదులు, రామలింగం, రవి, సత్యనారాయణరెడ్డి, యుగేందర్ రెడ్డి, పల్లి రాజుయాదవ్, శివ, శ్రవణ్, శివ, పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నోముల భగత్

డిప్యూటీ సీఎంను కలిసిన బాధితులు


డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బాధితులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన కపురతండా, మోదుగుల కుంట గ్రామాల్లోని ఆర్‌అండ్‌ఆర్ బాధితుల ఉద్యోగాల గురించి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బాధితులను తీసుకొని శనివారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను, సీఎండీని కలిశారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత వెంటనే ఉద్యోగ నియామకాల తేదీని ఖరారు చేసి ప్రతి ఒక్క బాధితుడికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి

నల్లగొండ : జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నామని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి కోమటి రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. మహిళా కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలలో చోటు కల్పించినట్లు తెలిపారు. మహిళలను రాజకీయంగా చైతన్యం చేసి సభ్యత్వం ఇచ్చేందుకు మెంబర్ షిప్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా మహిళా కాంగ్రెస్ కృషి చేయాలని కోరారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రజిత, కార్యదర్శి శ్రీలతరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు జానకి, కందిమల్ల నాగమణిరెడ్డి, ఉపాధ్యక్షురాలు సుజాత, చింతపల్లి సదాలక్ష్మి, కార్యదర్శి జక్కలి లలిత, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, సూరెడ్డి సరస్వతి, స్వరాజ్యలక్ష్మి, రుద్రమ్మ, నిర్మల, నవనీత, స్వరూపారెడ్డి, లింగమ్మ, కారింగు పల్లవి, లలిత, పందిరి రాధ, పద్మ, పావని, పరమేశ్వరి, రంగమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.